నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, శుక్రవారం 24 జనవరి 2025 | HANUMAKONDA

ఇండ్ల లిస్టులో తమ పేర్లు రాలేదని కలెక్టర్ ఎదుటే అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మా పేర్లు ఎందుకు రాలే?

కలెక్టర్ ఎదుట గంగదేవిపల్లి గ్రామస్తుల ఆగ్రహం

గీసుగొండ, జనవరి 23 : ఇండ్లు లేని వారికి ఇవ్వకుండా ఉన్న వారి పేర్లను ఎలా చేర్చారని కలెక్టర్ ఎదుట గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గంగదేవిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి హాజరు కాగా, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, రైతు భరోసాలో ఎంపికైన వారి లిస్టును అధికారులు చదివి వినిపించారు. దీంతో రేషన్ కార్డుల లిస్టులో తమ పేర్లు ఎందుకు రాలేదని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. లిస్టు అంతా తప్పులతడకగా రూపొందించారని మండిపడ్డారు. అధికారులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఆదర్శ గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని, కొత్త పింఛన్లు రావడం లేదని, దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు ఉన్నా పెన్షన్ ఇవ్వడం లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా చాలా మందికి విద్యుత్, గ్యాస్ సబ్సిడీ రావడం లేదని లబ్ధిదారులు తమ గోడును వెల్లబోసుకున్నారు. టెక్నికల్ సమస్యలున్నాయని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మీ పథకంలో మంజూరైన ఇండ్లను ఇందిరమ్మ పథకంలో తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అధికారులు గుర్తించి ఆ లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి, మండల ప్రత్యేకాధికారి సురేశ్, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏవో హరిప్రసాద్ బాబు, ఏవోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అంతా మోసం

కేసీఆర్ పాలనే బాగుండేది. కాంగ్రెస్ పాలనలో అంతా మోసం. ఊకల్ రైతు సహకార సంఘంలో నా పేరిట రూ. 90 వేల వ్యవసాయ రుణం ఉంది. మూడు నెలల నుంచి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా మాఫీ కాలేదు. సర్పంచ్ ఎన్నికల కోసం ప్రభుత్వం డ్రామాలు చేస్తున్నది. గత కేసీఆర్ హయాంలో నాకు రూ. 25 వేల రుణం మాఫీ అయింది. రైతు బంధు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీతో పాటు రైతు బంధు ఎగ్గొట్టింది. నాతో పాటు చానా మందికి రుణమాఫీ కాలేదు. కలెక్టర్ మాత్రం సొసైటీలో టెక్నికల్ సమస్య ఉంది.. దాంతో చాలా మందికి రుణమాఫీ కాలేదు.. అర్హులైన రైతులు దరఖాస్తులు ఇస్తే ప్రభుత్వానికి పంపుతామని చెప్పింది. రూ. రెండు లక్షల పైన ఉన్న డబ్బులు చెల్లించినా మాఫీ కాలేదని, ఎప్పుడు చేస్తారని అడిగితే సమాధానం చెప్పకుండా వెళ్లిపోయింది.

– కూసం రాజారాం, రైతు, గంగదేవిపల్లి, వరంగల్

గూడూరు గ్రామసభలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న మహిళ

కురవి : సూర్యతండాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీస్తున్న లబ్ధిదారులు

రచ్చ రచ్చ

- గ్రామసభల్లో అధికారులకు ప్రజల శాపనార్థాలు
- జాబితాలో పేర్లు లేకపోవడంపై తిరగబడిన మహిళలు
- ఇండ్లు, ఆత్మీయ భరోసా రాలేదని కంటతడి పెట్టిన ఆడపడుచులు
- గోడలకు అంటించిన లిస్టును చదవడమెందుకంటూ ఆగ్రహం
- బుట్టాయిగూడెంలో పురుగుల మందు తాగిన గ్రామస్తుడు
- దరఖాస్తులు తీసుకొని అర్ధాంతరంగా ముగిస్తున్న అధికారులు

• మూడో రోజూ కొనసాగిన ఆందోళనలు

అవే నిరసనలు.. నిలదీతలు.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. మూడో రోజైన గురువారం ప్రజలు అధికారులపై తిరగబడ్డారు. అర్హులైన పేదలను కాదని అనర్హులను ఎంపిక చేశారంటూ నిలదీశారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల జాబితా చదవగానే ప్రజలు వేదిక వద్దకు చేరుకొని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇచ్చారని, భూములున్నోళ్లనే ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారంటూ మండిపడ్డారు. పేర్లు చదవడమే తమ పని అని, ఎంపిక బాధ్యత కాదని పలుచోట్ల అధికారులు సమాధానమిచ్చారు. గోడపై అంటించిన జాబితా చదివేందుకు గ్రామసభలెందుకంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులను ఎంపిక చేయకుండా అనర్హులను గుర్తించాలంటూ తమను అడగడమేంటని మండిపడ్డారు. తాము అన్ని విధాలా అర్హులమైనా తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ పలువురు మహిళలు గ్రామసభల్లోనే కన్నీరు పెట్టుకున్నారు. పలుచోట్ల ప్రజలు గ్రామసభ వేదిక ఎదుట, రోడ్డపై బైఠాయించి తమ నిరసనను తెలిపారు. ఊరూరా నిలదీతలు ఉండడంతో అధికారులు జాబితాలోని పేర్లు చదివి అర్ధాంతరంగా గ్రామసభలు ముగించి వెళ్లిపోయారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేరు లేదని మనస్తాపంతో గ్రామస్తుడు నాగేశ్వర్‌రావు అధికారుల సాక్షిగా పురుగుల మందు తాగాడు. ప్రస్తుతం విషమ పరిస్థితిలో ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. కాగా, పోలీసులు ముందుండి గ్రామసభలను నడిపించారు. అధికారులను ప్రశ్నించే వారిని అడ్డుకొని బయటకు పంపడంతో పాటు వీడియోలు చిత్రీకరించారు. - నమస్తే నెట్‌వర్క్, జనవరి 23

దండం పెడతా సారూ.. న్యాయం చేయండి

అధికారిని వేడుకున్న వృద్ధుడు

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన ఈ వృద్ధుడి పేరు సుంకరి ఏసయ్య. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా అధికారులు పథకాలకు సంబంధించిన జాబితాలను చదివి వినిపించారు. అందులో అర్హులవి కాకుండా అనర్హుల పేర్లే అధికంగా ఉండడంతో ఆగ్రహానికి గురయ్యాడు. అధికారుల వద్దకు వెళ్లి తనకు ఒక్క పథకం కూడా రాలేదంటూ నిలదీశాడు. 'సారూ.. మీకు దండం పెడతా.. మాకు న్యాయం చేయండి.. అర్హులైన నిరుపేదలకు పథకాలు అందించండి' అంటూ చేతులు జోడించి వేడుకున్నాడు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కలచివేయగా, ప్రభుత్వం ప్రకటిస్తున్న లబ్ధిదారుల జాబితాల్లోని లోటుపాట్లను ఘటన ఎత్తిచూపింది.

– పెద్దవంగర, జనవరి 23


గ్రామ సభలో అధికారులతో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపం

- గ్రామ సభలో పురుగుల మందు తాగిన వ్యక్తి
- ములుగు జిల్లా బుట్టాయిగూడెంలో ఘటన
- ప్రాణాపాయ స్థితిలో ఎంజీఎంలో చికిత్స

చికిత్స పొందుతున్న నాగేశ్వర్‌రావు

కన్నాయిగూడెం/ఏటూరునాగారం, జనవరి 23 : ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రజాపాలన గ్రామసభ జరుగుతుండగానే అధికారుల సాక్షిగా పురుగుల మందు తాగి ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపించారు. దీంతో కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వరరావు (నాగయ్య) అనే దళితుడు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తన పేరు రాలేదని అధికారులను నిలదీశాడు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల్లో అర్హులు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయని, ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎలా వస్తాయని ప్రశ్నించాడు. గత ఏడాది తన ఇల్లు కాలిపోయిందని ఫొటోలను అధికారులకు చూపెడుతూనే 'నాకు రాకపోయినా నా చావుతోనైనా గ్రామంలోని అర్హులకు పథకాలు ఇవ్వాలి' అని అధికారులకు చెప్పి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన గ్రామస్తులు మందు డబ్బాను లాక్కోగా, అక్కడే ఉన్న తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వనిత వాసనకు ముక్కు మూసుకొని పక్కవెళ్లిపోయారు. అక్కడే ఉన్న ఇతర అధికారులు, గ్రామస్తులు నాగయ్యను అంబులెన్సులో ఏటూరునాగారం సీఎచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు.

కాంగ్రెస్ నాయకుల బెదిరింపులతోనే.. : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి

ప్రభుత్వ పథకాలు పేదలకు అందడం లేదని, తన పేరు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు గ్రామసభలో బెదిరించడంతోనే మనస్తాపానికి గురైన నాగేశ్వర్‌రావు పురుగుల మందు తాగాడని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు ఆరోపించారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయ కక్షతో పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దన్నారు. నిరుపేదలకు పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఇల్లు లేక కిరాయికి ఉంటున్న

దేవరుప్పుల : నాకు ఇల్లు లేక రెండేళ్ల నుంచి ఊర్లనే కిరాయికి ఉంటున్న. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసిన. గ్రామ సభల నా పేరు రాలే. ఇంత అన్యాయమా? ఇల్లు కోసం ఎదురు చూస్తున్న నా పేరు లిస్టుల లేదంటే ఇదేం రాజకీయం. ఊర్ల లేనోళ్లు, ఇల్లున్నోళ్ల పేర్లు చదివింద్రు. ఇది అధికారుల తప్పిదమా? లేక ఇందిరమ్మ కమిటీ సభ్యులు నా పేరు తీసేసిండ్రా? చెప్పాలె. జాగా ఉంటె ఇల్లిస్తమని ప్రచారం చేసిండ్రు. నాకు జాగా ఉండి ఇల్లు లేదు. ప్రభుత్వ పథకం కోసం ఆశపడితే అడియాశైంది.

– బూరుగు అశోక్, గొల్లపల్లి, దేవరుప్పుల

అర్హులను ప్రకటించలేని గ్రామ సభలెందుకో..?

నల్లబెల్లి : అర్హులను ప్రకటించని గ్రామ సభలెందుకో మరి. ప్రజాపాలన, కులగణనలో తమకు కావాల్సిన పథకాల గురించి దరఖాస్తు చేశాం. కుటుంబ వివరాలు ఇచ్చాం. అయినా మళ్లా కొంతమందిని దరఖాస్తు చేసుకోవాలంటున్నరు. మరి గప్పుడు దరఖాస్తులు చేసుకున్న కాగితాలు ఏమయినయి. చెత్తబుట్టలో ఏశారా. ప్రజాపాలన, కులగణన పేరుతో ప్రభుత్వం కోట్లు ఖర్చు చేత్తాంది. గా పైసలతోనే బీదోళ్లకు ఇండ్లు ఇవ్వొచ్చు కదా. మేమైతే అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి పనులు చేశాం. 9 నెలలైతాంది గీ కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లి గవ్వ ఇయ్యక పాయే. అప్పిచ్చినోడు లొల్లిపెట్టబట్టే. దీంతో ఇంటోడితో నిత్యం ఇబ్బందులు పడుతుంటిమి. ఇగనైనా సర్కారు నిరుపేదలకు పథకాలు ఇయ్యాలే. మహిళలకు బాకీ ఉన్న డబ్బులు విడుదల చేయాలే. లేదంటే అమ్మలక్కల ఉసురు ఊరికనే పోదు.

– కనకం అనూష, నల్లబెల్లి, వరంగల్

పేదలకు ఇల్లు ఇవ్వరా?

గ్రామసభలో కన్నీటి పర్యంతమైన మహిళ

పెద్దవంగర, జనవరి 23 : 'రోజు కూలినాలి చేసుకుంటేనే బతుకుదెరువు. నాకు సొంతిల్లు.. గుంట భూమి లేదు. ప్రజా పాలనలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు రాలేదు. ఇందిరమ్మ ఇల్లు పేదలకు ఇవ్వరా? ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇచ్చుడేంది? నేను ఒంటరి మహిళను' అంటూ పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన ఎండీ మున్ని గురువారం జరిగిన గ్రామసభలో కన్నీరు పెట్టుకుంది. కాంగ్రెస్ సర్కారు వస్తే కష్టాలు తీరతాయనుకుంటే పేదలకే నష్టం జరుగుతుందని, ఇదెక్కడి న్యాయం? అంటూ ప్రశ్నించింది. తనకు ఇల్లు మంజూరు చేయాలంటూ అధికారులను వేడుకుంది.


భీమదేవరపల్లి : వంగరలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

బయ్యారం : బాలాజీపేట గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు


కమలాపూర్ : కానిపర్తిలో ఎంపీడీవో బాబుతో వాగ్వాదం

వేలేరు : పీచరలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

ఇనుగుర్తి గ్రామసభలో తన పేరు ఆత్మీయ భరోసా జాబితాలో లేదని జాబ్‌కార్డు చూపిస్తున్న వృద్ధుడు

పాలకుర్తి : బీఆర్ఎస్, బీజేపీ, ప్రజా సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నర్మెట : జాబితాలో తన పేరు లేదని మచ్చుపహాడ్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న చింతల రేణుక

ప్రజలు తిరగబడుతున్నరు

- ములుగు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : ములుగు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వంతో పాటు అధికారులపై తిరగబడుతున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ తీరుతోనే కుమ్మరి నాగేశ్వర్‌రావు ఆత్మహత్యకు యత్నించాడని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో గతంలో స్వీకరించిన దరఖాస్తులను పక్కనపెట్టి మళ్లీ చేసుకోవాలనడంతో ప్రజలు మనస్తాపానికి గురవుతున్నారన్నారు. మంత్రి సీతక్క తమ పార్టీ కార్యకర్తలకు పథకాలను అందిస్తూ సామాన్య ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. నాగేశ్వర్‌రావు ఆత్మహత్యాయత్నానికి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

మాజీ కౌన్సిలర్ దంపతులపై కాంగ్రెస్ నేత దాడి

- పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : ఎస్సై
- కక్షసాధింపు తగదు : బీఆర్ఎస్

మాజీ కౌన్సిలర్‌పై దాడి చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఓర్సు తిరుపతయ్య, అతని కుటుంబ సభ్యులు, బాధితుడిని దవాఖానలో పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట, జనవరి 23 : మాజీ కౌన్సిలర్‌పై కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఓబీసీ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతయ్య దాడి చేసిన సంఘటన నర్సంపేట పట్టణం వడ్డెరకాలనీలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 15వ వార్డు మాజీ కౌన్సిలర్ శివరాత్రి వెంకటమ్మ-స్వామి ఇంటికి వచ్చిన మున్సిపల్ అధికారులకు దంపతులిద్దరూ ఇంటి పర్మిషన్ పత్రాలను చూపించారు. దీంతో అధికారులు స్వామి ఇంటి ముందు 30 ఫీట్ల రోడ్డు ఉందని నిర్ధారించి మార్కింగ్ చేసి అక్కడే ఉన్న వర్క్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్‌కు చెప్పి వెళ్లారు. వారు వెళ్లిన తర్వాత ఓబీసీ జిల్లా చైర్మన్ తిరుపతయ్య అతడి కుటుంబ సభ్యులైన ఓర్సు వెంకన్న, ఓర్సు రమేశ్, ఓర్సు అశోక్, ఓర్సు రాజు, ఓర్సు పరమేశ్ అదే రోడ్డుకు ఒక పక్కన జేసీబీతో కాలువ తీస్తూ స్వామి ఇంటి వరకు వచ్చారు. ఇంటిముందు మున్సిపల్ అధికారులు పెట్టిన మార్కింగ్‌ను దాటి ప్రహరీని కూల్చేందుకు డ్రైవర్ ప్రయత్నించగా వెంటనే స్వామి డ్రైవర్‌కు మున్సిపల్ అధికారులు పెట్టిన హద్దుదాటి తీయవద్దు అని చెబుతుండగానే తిరుపతయ్యతో పాటు మిగతా ఐదుగురు ఓర్సు వెంకన్న, రమేశ్, అశోక్, రాజు, పరమేశ్ అకారణంగా రాళ్లతో స్వామి ఇంటిపైకి దాడి చేసి కడుపులో, ఛాతిలో, తలపై విపరీతంగా కొట్టారు. ఈ క్రమంలో స్పృహకోల్పోయిన స్వామిని అతడి ఇంట్లో కిరాయికి ఉంటున్న రవి ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేశాడు. ఇంటిముందున్న మాజీ కౌన్సిలర్ శివరాత్రి వెంకటమ్మపై తిరుపతయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు స్థానికులు తెలిపారు. నిందితులపై స్వామి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా తిరుపతయ్య కూడా స్వామిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరువురు ఫిర్యాదులు చేశారని విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భౌతిక దాడులు సరికాదు..

కాంగ్రెస్ నాయకుడు తిరుపతయ్య, అతని కుటుంబసభ్యులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన మాజీ కౌన్సిలర్ దంపతులు శివరాత్రి వెంకటమ్మ-స్వామిని నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, పట్టణ సహాయ కార్యదర్శి రావుల సతీశ్, 3వ వార్డు అధ్యక్షుడు బీరం నాగిరెడ్డి, నల్లా రవీందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ అనుమతులున్నా కక్ష సాధింపు చర్యలతో దాడులకు దిగడం తగదన్నారు. ఏమైనా సమస్యలుంటే చట్టపరంగా ఎదుర్కోవాలని, ఇలా భౌతిక దాడులకు దిగడం మంచి పద్ధతి కాదని వారు తెలిపారు. పోలీసులు సరైన విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.